క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

విశాఖ విద్య: బుచ్చి రాజుపాలెం సబ్ స్టేషన్‌లో 11కేవీ ఫీడర్, పోలీస్ స్టేషన్ ఫీడర్‌లో మరమ్మతులు కారణంగా శుక్రవారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్‌శాఖ జోన్–3 ఈఈ శ్రీనివాసరావు తెలిపారు. సుసర్ల కాలనీ, సీతారామరాజు నగర్, రెడ్డి వీధి, గాంధీనగర్, గవర వీధి, ఇందిరా ప్రియదర్శిని కాలనీ, ఏపీఎస్‌ఈబీ కాలనీ, బాజీ జంక్షన్, విద్యానగర్, రవీంద్ర నగర్, నాయుడు క్వార్టర్స్, స్టేషన్ రోడ్డు తదితర ప్రాంతాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

క్లాత్ బ్యాగుల పంపిణీ


క్లాత్ బ్యాగులను పంపిణీ చేస్తున్న పుర్రె సురేష్‌యాదవ్

మల్కాపురం: ప్లాస్టిక్ బ్యాగుల నిషేధంపై జీవీఎంసీ అధికారులు అడుగులు వేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన పిలుపు మేర పారిశ్రామిక ప్రాంత పరిధి పలు ప్రాంతాలలో జీవీఎంసీ అధికారులు, సిబ్బందితో కలిసి ఆయా ప్రాంతాల నాయకులు పలు దుకాణాల వద్దకు వెళ్లి, ప్లాస్టిక్ బ్యాగులకు బదులు, క్లాత్ బ్యాగులను, పేపర్ బ్యాగులను వినియోగించాలని అవగాహన కల్పించారు. దీనిలో భాగంగా 59వ వార్డు హిమచల్‌నగర్, ములగాడ హౌసింగ్‌కాలనీల వద్ద వార్డు కార్పొరేటర్ పుర్రె పూర్ణశ్రీయాదవ్, నాయకులు పుర్రె సురేష్‌యాదవ్, శంకర్, రామోహన్ నాయుడు తదితరులు పలువురికి క్లాత్ బ్యాగులను పంపిణీ చేశారు.

చెట్టు కొమ్మలు తొలగింపు


చెట్టు కొమ్మలను తొలగిస్తున్న జీవీఎంసీ సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

మల్కాపురం: పారిశ్రామిక ప్రాంత పరిధిలోని పలు సేవా మార్గాల్లో వెలగని విద్యుత్ షో ల్యాంప్స్, వెలుగుతున్న విద్యుత్ దీపాలకు అడ్డంగా ఉన్న చెట్టు కొమ్మలపై సాక్షి పత్రికలో గురువారం అక్కడ వెలుగులు, ఇక్కడ చీకటి శీర్షికన ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. సిబ్బంది సాయంతో శ్రీహరిపురం కూడలి వద్ద విద్యుత్ లైట్లకు అడ్డంగా ఉన్న చెట్టు కొమ్మలను తొలగించారు.

రక్తదానంతో ఆరోగ్యానికి మేలు

ఆరిలోవ : రక్తదానం ప్రాణాలను కాపాడుతుందని విమ్స్ డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబు తెలిపారు. విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (విమ్స్)లో గురువారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు విమ్స్ సిబ్బంది రక్తం అందించడానికి ముందుకొచ్చారు. ఇక్కడ ఇటీవల బ్లడ్ బ్యాంక్ అందుబాటులోకి వచ్చింది. అందులో నిల్వ చేయడానికి అవసరమైన రక్తం కోసం విమ్స్ అధికారులు రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని ప్రారంభించిన డైరెక్టర్ రాంబాబు రక్తదాతలను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవసరానికి రక్తం లభ్యం కాకపోవడంతో చాలా మంది ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. ప్రతి ఆరు నెలలకు ఓసారి రక్తదానం చేయవచ్చన్నారు. దానివల్ల శరీరానికి మేలు జరుగుతుందన్నారు. కొత్త రక్తం చేరి శరీరంలో ఉత్తేజం కలుగుతుందన్నారు. రక్తదానం చేయడం వల్ల ఆపదలో ఉన్న వారి ప్రాణాలు కాపాడడంతోపాటు రక్తం ఇచ్చిన వారు కూడా ఆరోగ్యంగా ఉంటారన్నారు. అనంతరం రక్తదానం చేసిన వారికి సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో విమ్స్ కార్యాలయం పర్యవేక్షణాధికారి సత్యనారాయణ, పరిపాలనాధికారి షేక్ బాజీ, వైద్యులు, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీసీ ఆదాయానికి గండి

- బస్టాప్‌ల వద్ద అడ్డదిడ్డంగా ఆటోలు
- బస్సులు ఎక్కేందుకు ప్రయాణికుల పాట్లు
- అధికారులు చర్యలు తీసుకోవాని డిమాండ్


శ్రీహరిపురం బస్టాప్‌నకు అడ్డంగా ఆటోలు


కోరమాండల్ బస్టాప్ వద్ద అడ్డంగా ప్రైవేట్ వాహనాలు పార్కింగ్

మల్కాపురం: ఆటోలు నిబంధనలు పాటించడం లేదు. ట్రాఫిక్ పోలీసులు అవగాహన కల్పిస్తున్నా ఆటో డ్రైవర్లు పట్టించుకోవడం లేదు. ఆర్టీసీ బస్సుల ఆదాయానికి గండి కొడుతున్నారు. బస్టాప్‌లు వద్ద అడ్డదిడ్డంగా ఆటోలు నిలిపివేస్తున్నారు. దీంతో బస్టాండ్ వద్ద బస్సులు ఆపేందుకు అవకాశం లేకుండా పోతోంది. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బస్టాండ్‌కు దూరంగా బస్సులు ఆపుతుండడంతో యువకులు పరుగులు తీయాల్సి వస్తోంది. మహిళలు, వృద్ధులకు ప్రయాస తప్పడం లేదు.

పారిశ్రామిక ప్రాంత పరిధిలో శ్రీహరిపురం, మల్కాపురం, కోరమాండల్, ఆర్‌కేపురం కూడలిలో ఆర్టీసీ బస్టాప్‌ల వద్ద ఉదయం 7 గంటల నుంచి 10 గంటలవరకు వివిధ పరిశ్రమల్లో పని చేసే ఉద్యోగులు, పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు బస్సుల కోసం వేచి ఉంటారు. అదే సమయంలో కొంత మంది ఆటోవాలాలు ఆయా బస్టాప్‌ల వద్ద తమ తమ ఆటోలను అడ్డంగా నిలుపుతున్నారు. దీంతో బస్సులు ఆగే స్థలం లేక పోవటంతో దూరంగా నిలుపుతున్నారు. బస్సులు ఎక్కేందుకు ఉద్యోగులు, విద్యార్థులు పరుగులు తియ్యాల్సిన సమయంలో అడ్డంగా ఉన్న ఆటోలను తప్పించుకోలేక, అదుపు తప్పి పడిపోతున్నారు. కొందరు బస్సులను అందుకోలేక ఆలస్యంగా విధులకు, కళాశాలలకు వెళ్లే పరిస్థితులున్నాయి. ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్న ఆటోల వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నా..ట్రాఫిక్ పోలీసులు పట్టించుకోవడం లేదు. అటు ఆర్టీసీ అధికారులు కూడా తమకేమీ పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. ఆదాయానికి గండి పడుతున్నా పట్టించుకోవడం లేదు. అధికారులు స్పందించి నిబంధనలు పాటించని ఆటో డ్రైవర్లకు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

నిత్యం యాతన



సబ్బవరంలో సొంత పనుల నిమిత్తం మల్కాపురం బస్టాప్ వద్ద బస్సు కోసం వేచి చూశా. తీరా బస్సు వచ్చే సమయానికి అక్కడ ఆటోలు అడ్డంగా ఉండటంతో ఎక్కలేని పరిస్థితి ఎదురైంది. చివరకు నా ప్రయాణాన్ని వాయిదా వేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. నిత్యం ఇక్కడ ఆటోల వల్ల ఇబ్బందులు ఏర్పడుతున్నాయి.

–మంగవేణి, మల్కాపురం,గృహిణి

ఇబ్బందులు పడుతున్నాం



కొమ్మాది వద్ద గల ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ చదువుతున్నా. శ్రీహరిపురం బస్టాప్ వద్ద రోజూ బస్సు ఎక్కుతా..ఆ సమయంలో ఆటోలు బస్టాప్ వద్ద అడ్డంగా ఉంటాయి. దీంతో రోజు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నాం. ఈ సమస్యపై అధికారులు స్పందించాలి. చాలా మంది విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు.

–విక్రమ్ యాదవ్, బీటెక్ విద్యార్థి, శ్రీహరిపురం

బంగారు ఆభరణాల స్వాధీనం

నిందితులకు రిమాండ్


నిందితులతో క్రైమ్ ఎస్‌ఐ సుదర్శనరావు

గోపాలపట్నం: మూడున్నర తులాల బంగారు ఆభరణాలను రికవరీ చేసి, ఎయిర్‌పోర్టు పోలీసులు నిందితులను రిమాండ్‌కు పంపారు. ఎయిర్‌పోర్టు క్రైమ్ ఎస్‌ఐ సుదర్శన్ తెలిపిన వివరాలు లా ఉన్నాయి. పెందుర్తికి చెందిన లోకిరెడ్డి ప్రియాంక గత నెల 30వ తేదీ సాయంత్రం 5 గంటలకు గాజువాక నుంచి పెందుర్తి వెళ్లేందుకు ఆటోలో బయలు దేరింది. ఎన్‌ఏడీ జంక్షన్‌లో దిగే సమయంలో బ్యాగు జిప్ తీసి ఉంది. బ్యాగులో ఉన్న మూడున్నర తులాల బంగారం వస్తువులు లేక పోవడంతో ఆటోలో వ్యక్తులు గురించి ఆరా తీశారు. గాజువాకలో గుర్తు తెలియని ఇద్దరు మహిళలు ఆటో ఎక్కారని, వారు మాటల్లో పెట్టి బ్యాగులో ఉన్న రెండు గాజులు, లాకెట్‌తో ఉన్న ఒక చైన్, మూడు చెవిదిద్దులు దొంగలించి ఉంటారని బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు దర్యాప్తు చేయగా ఆటోలో ప్రియాంకతో పాటు రావుల పార్వతి, గంగమ్మ ప్రయాణించినట్టు గుర్తించారు. వీరిద్దరూ పాత నేరస్తులుకావడంతో విచారణ చేయగా వస్తువులు అపహరించినట్టు అంగీకరించారు. దీంతో వీరిని అరెస్టు చేసి బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు.

రక్షణ గోడల నిర్మాణానికి శంకుస్థాపన


శంకుస్థాపన చేస్తున్న రమణ

విశాఖ విద్య: జీవీఎంసీ 90వ వార్డు పరిధి లోని కొండవాలు ప్రాంతమైన లక్ష్మీనగర్–ఎఫ్ బ్లాక్ సమీపాన కొండవాలు ప్రాంతంలో రక్షణ గోడల నిర్మాణానికి గురువారం కార్పొరేటర్ బొమ్మిడి రమణ అధికారులతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా కొద్దిపాటి వర్షాలకు సైతం కొండ చర్యలు విరిగిపడి తరచూ ఆస్తి నష్టం జరుగుతోందని, ఈ సమస్యను స్థానిక నాయకులు తమ దృష్టికి తీసుకురావటంతో జీవీఎంసీ ద్వారా నిధులు కేటాయింపులు చేసేలా కృషి చేసినట్లు తెలిపారు. రూ.1.24 కోట్లతో రక్షణగోడలను నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఈ పనులు పూర్తయితే లక్ష్మీనగర్ ప్రాంత కొండవాలు నివాసితులకు ఎంతో సౌలభ్యంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ ఏఈ వెంకట లక్ష్మి, వర్క్ ఇన్స్పెక్టర్ రామ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సంక్రాంతి సెలవులు అమలు చేయాల్సిందే ..

విశాఖ విద్య : జిల్లాలోని అన్ని యాజమాన్యాల పాఠశాలలు ఈ నెల 10 నుంచి 19 వరకు సంక్రాంతి సెలవులు పక్కగా అమలు చేయాల్సిందేనని ఆంధ్రప్రదేశ్ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం అన్నారు. కమిషన్ చైర్‌పర్సన్ కేసలి అప్పారావు నేతృత్వంలో ఇప్పటికే సెలవులపై అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్టు గురువారం తెలిపారు. ఈ సెలవుల్లో పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతుల పేరిట కొన్ని యాజమాన్యాలు ఇప్పటికే ఒత్తిడి తెస్తున్నట్లు ఆధారాలతోపాటు తమ కమిషన్‌కు ఫిర్యాదులు అందుతున్నాయన్నారు. ఏ యాజమాన్యానికీ మినహాయింపులు లేవన్నారు. అటువంటి పాఠశాలలపై ఆయా జిల్లా విద్యాశాఖాధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు.

నేత్రపర్వం.. పగల్‌పత్తు ఉత్సవం


తిరువీధిలో పాల్గొన్న భక్తులు, బేడా మండపంలో అప్పన్న ఉత్సవమూర్తుల తిరువీధి (ఇన్‌సెట్) వెంకన్న ఆలయంలో విశేష అలంకారంలో గోదాదేవి

- అప్పన్న ఆలయంలో ఘనంగా ముగిసిన వేడుకలు
- పెద్ద ఎత్తున పాల్గొన్న భక్తులు
- నేటి నుంచి రాపత్తు ఉత్సవాలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో పది రోజులుగా జరుగుతున్న పగల్‌పత్తు ఉత్సవాలు గురువారంతో ఘనంగా ముగిశాయి. ఉదయం అయ్యవారి సేవలను విశేషంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను విశేషంగా అలంకరించి పల్లకిలో కొలువుదీర్చారు. ఆలయ బేడామండపంలో వైభవంగా తిరువీధి నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

నేటి నుంచి రాపత్తు ఉత్సవాలు

అప్పన్న ఆలయంలో శుక్రవారం నుంచి పదిరోజుల పాటు రాపత్తు ఉత్సవాలను విశేషంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా ఒక్కోరోజు ఒక్కో అలంకారంలో సింహగిరి మాడ వీధుల్లో స్వామికి తిరువీధి నిర్వహిస్తారు.

విశేషంగా ధనుర్మాస పూజలు

సింహగిరిపై ధనుర్మాసం పూజలను గురువారం కనులపండువగా నిర్వహించారు. తెల్లవారుజామున 3గంటలకు స్వామికి సుప్రభాత సేవ నిర్వహించారు. విశేష ఆరాధన, చతుర్వేద పారాయణం, ఉపనిషత్తు పారాయణం, తిరుప్పావై సేవాకాలం, సాత్తుమొర్రై, గోదాదేవికి బేడామండపంలో తిరువీధిని వైభవంగా నిర్వహించారు.

వెంకన్న ఆలయంలో..

శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానానికి చెందిన వేంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం ధనుర్మాస పూజలను వైభవంగా జరిగాయి. గోదాదేవి అమ్మవారికి విశేష అలంకరణ చేసి వేదికపై కొలువుదీర్చి, పాశుర విన్నపం చేశారు. ఆలయ అర్చకులు భార్గవ్ తదితరులు ఈ పూజలు నిర్వహించారు.

‘ఆంధ్రులంటే ప్రధానికి చులకన ’


మాట్లాడుతున్న సిటూ నాయకులు రామారావు

అగనంపూడి: ఆంధ్ర రాష్ట్రమన్నా, తెలుగు ప్రజలన్నా ప్రధాన మంత్రి మోదీకి ఎలాంటి అభిప్రాయం ఉందో విశాఖ సభతో అర్థమైందని విశాఖ ఉక్కు సిటూ నాయకులు యు.రామస్వామి, ఎస్.రామారావు ఆరోపించారు. తెలుగు ప్రజల ఆత్మగౌరవంతో సమానమైన విశాఖ స్టీల్‌ప్లాంట్ విషయంలో మాట్లాడకపోవడంతో దురదృష్టకరమన్నారు. విశాఖ ఉక్కు పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో కూర్మన్నపాలెం కూడలిలో 1,428వ రోజు రిలే దీక్షా శిబిరంలో సీటూ ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తన విధానాలను చకచకా అమలు చేసుకుపోతోందని, దీన్ని వల్ల భవిష్యత్ పెట్టుబడిదారి వర్గం, సామాన్య వర్గాల మధ్య తారతమ్యాలు అంతరాలు పెరిగిపోయి దోపిడీకి తావుతీస్తోందన్నారు. స్టీల్‌ప్లాంట్‌పై మోదీ విశాఖ సభలో సానుకూల ప్రకటన చేస్తారని, ఈ విషయంలో ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి చొరవ తీసుకుంటారని అంతా భావించామని, కాని దీనికి భిన్నంగా స్టీల్‌ప్లాంట్ గురించి మాట్లాడడపోవడంతో నిరాశకు గురిచేసిందన్నారు. ఇదిలావుండగా నిరసన దీక్షలో పాల్గొకుండా ఉక్కు యాజమాన్యం ఆంక్షలు విధిస్తోందని, సెలవులు కూడా వినియోగించుకోకుండా నియంత్రిస్తుండడం దుర్మార్గమైన చర్య అన్నారు. కార్యక్రమంలో నాయకులు కె.గంగాధర్, డీఎస్‌ఆర్‌సీ మూర్తి, పుల్లారావు, ఆర్.వెంకటరావు, బి.దుర్గాప్రసాద్, సత్యారావు, ఎర్రయ్య, జగ్గారావు, శ్రీనివాస్, సన్యాసిరావు, దత్తాత్రేయ రాజు, శ్రీనివాస్‌రెడ్డి, సూరిబాబు, అప్పలరాజు, అప్పారావు పాల్గొన్నారు.

నేటి నుంచి సింహగిరిపై ధారోత్సవాలు


గంగధార వద్ద విద్యుద్దీపాలంకరణ

సింహాచలం: సింహగిరిపై శుక్రవారం నుంచి ధారోత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు సింహాచలం దేవస్థానం అధికారులు, వైదికులు ఏర్పాట్లు చేశారు. సింహగిరిపై గంగధార వద్ద ఈ నెల 14 వరకు ఉదయం వేళల్లో ధారోత్సవాలు జరగనున్నాయి. గోదాదేవి అమ్మవారి ఉత్సవమూర్తిని ఈ నెల 10, 11తేదీల్లో గంగధార వద్దకు తీసుకెళ్లి అభిషేకాలు నిర్వహించనున్నారు. అక్కడే తిరుప్పావై సేవాకాలం, పాశుర విన్నపం చేస్తారు. 12వ తేదీన గోదాదేవి, సువర్ణ అమ్మవారు, చతుర్భుజ తాయారు అమ్మవార్ల ఉత్సవమూర్తులను గంగధార వద్దకు తీసుకెళ్లి అభిషేకాలు నిర్వహిస్తారు. 13న గోదాదేవి, సువర్ణ అమ్మవారు, చతుర్భుజ తాయారు, శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను గంగధార వద్దకు తీసుకెళ్లి అభిషేకాలు నిర్వహిస్తారు. 14న స్వామివారి ఉత్సవమూర్తులు, మదన గోపాలస్వామి ఉత్సవమూర్తులు, గోదాదేవి, సువర్ణ అమ్మవారు, చతుర్భుజ తాయారు మూర్తులను తీసుకెళ్లి అభిషేకాలు నిర్వహిస్తారు. ఈ మేరకు గంగధార వద్ద విశేషంగా ఏర్పాట్లు చేశారు. విద్యుద్దీపాలంకరణ ఆకట్టుకుంటోంది.

ప్లాస్టిక్‌రహిత నగరంగా విశాఖను తీర్చిదిద్దాలి


ప్లాస్టిక్ వినియోగంపై అవగాహన కలిగిస్తున్న వార్డు కార్పొరేటర్ గల్లా చిన్నా


40వ వార్డులో ప్లాస్టిక్ నియంత్రణపై అవగాహన కలిగిస్తున్న కార్పొరేటర్ నాగేశ్వరరావు

సింథియా: ప్లాస్టిక్ రహిత నగరంగా విశాఖను తీర్చిదిద్దడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పాలిథిన్‌ను నిషేధించాలని 40వ వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు కోరారు. ఏకేసీకాలనీ, రాజీవ్‌కాలనీ, మెయిన్ రోడ్డులో ప్లాస్టిక్ నిషేధంపై జీవీఎంసీ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రజలు, వ్యాపారులు తగిన సహకారం అందించాలన్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులు వినియోగంపై చర్యలు తీసుకుంటారని తెలిపారు. ప్లాస్టిక్‌కు బదులుగా ప్రత్యామ్నాయ వస్తువులు వినియోగించాలని సూచించారు. కార్యక్రమంలో జనసేన వార్డు అధ్యక్షులు శివశంకర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రమేష్, సచివాలయ సిబ్బంది సత్తిబాబు, రాజబాబు, కల్యాణి, నవ్య, ఆశ కార్యకర్తలు పావని, నాగమణి, కుమారి, ఆర్పీలు సంతోషి, ఈశ్వరి, సూపర్‌వైజర్ శ్రీను, శానిటరీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

63వ వార్డులో అవగాహన

జీవీఎంసీ 63వ వార్డు పరిధి చింతల్లోవ, కాకరలోవ, క్రాంతినగర్ ప్రాంతాల్లో కమర్షియల్ షాపులు వద్ద కలెక్టర్ ఆదేశాల మేరకు, జోన్–5 జోనల్ కమిషనర్ ఆధ్వర్యంలో ప్లాస్టిక్ నియంత్రణపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వార్డు కార్పొరేటర్, జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యులు గల్లా చిన్నా ముఖ్య అతిథిగా పాల్గొని వ్యాపారులకు పలు సూచనలు చేశారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వల్ల కలిగే నష్టాలను వివరిస్తూ , భవిష్యత్తులో ప్లాస్టిక్‌కు బదులుగా గుడ్డ సంచులు, నార సంచులు, స్టీల్ బాక్సులు వాడాలని సూచించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ రమేష్, శానిటరీ విభాగ సిబ్బంది నజీమ, ఆర్పీలు, మెడికల్ ఇంచార్జిలు, వార్డు సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.


కరపత్రాలను అందజేస్తున్న డిప్యూటీ మేయర్ శ్రీధర్

పాలిథిన్ కవర్లు వాడొద్దు

గోపాలపట్నం: నిషేధిక ప్లాస్టిక్ కవర్లు వాడవద్దని, నార, గుడ్డ సంచులే వాడాలని ఎమ్మెల్యే గణబాబు పిలుపునిచ్చారు. ఈమేరకు ఆయన క్యాంప్ కార్యాలయంలో జీవీఎంసీ ముద్రించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ రహిత సమాజాన్ని నిర్మించేందుకు ప్రజలు సహకరించాలన్నారు. ప్రతి ఒక్కరూ తమ వెంట క్లాత్ బ్యాగులను తీసుకువెళ్లాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సచివాలయ కార్యదర్శులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.


పోస్టర్ ఆవిష్కరించిన ఎమ్మెల్యే గణబాబు

ప్లాస్టిక్ నిర్మూలనలో భాగస్వామ్యులు కావాలి

విశాఖ విద్య: పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్లాస్టిక్ నిర్మూలనకు ప్రతీ ఒక్కరూ భాగస్వామ్యులు కావాలని డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ సూచించారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా జీవీఎంసీ ఆధ్వర్యంలో గురువారం చేపట్టిన సే నో టు ప్లాస్టిక్ ప్రచార కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. జీవీఎంసీ 52వ వార్డు మర్రిపాలెం వుడా లే అవుట్ ప్రాంతంలో ఉన్న దుకాణదారులకు అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ వినయోగించటంపై పర్యావరణం పై ఎలాంటి ప్రభావం చూపిస్తుందనే విషయాలను పారిశుధ్య అధికారులతో కలసి వివరించారు. పర్యావరణ పరిరక్షనలో అందరూ భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో వార్డు పారిశుధ్య అధికారి మూర్తి, సచివాలయ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

మోదీ, బాబు, పవన్‌ల తీరుపై నల్ల జెండాలతో సీపీఎం నిరసన


పాతగాజువాకలో నల్ల జెండాలతో నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

గాజువాక : విశాఖలో బుధవారం నిర్వహించిన సభలో విశాఖ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మాట్లాకపోవడంపై సీపీఎం గాజువాక జోన్ నాయకులు నల్ల జెండాలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యురాలు పి.మణి మాట్లాడుతూ విశాఖ జిల్లాలో రెండు లక్షల కోట్లతో చేపట్టనున్న ప్రాజెక్టుల కోసం శంకుస్థాపన చేసిన ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి తెలుగు ప్రజల త్యాగఫలమైన విశాఖ ఉక్కు కోసం కనీసం ప్రస్తావించకపోవడం దుర్మార్గమన్నారు. సీపీఎం గాజువాక జోన్ కార్యదర్శి ఎం.రాంబాబు మాట్లాడుతూ తమను గెలిపిస్తే విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేట్‌పరం కాకుండా కాపాడుతామని ఎన్నికలకు ముందు మాట్లాడిన పవన్ కల్యాణ్, చంద్రబాబు గెలిచిన తరువాత పట్టించుకోవడంలేదన్నారు. ఎన్నికలకు ముందు విశాఖ ఉక్కు కోసం నిరాహారదీక్ష చేసిన పల్లా శ్రీనివాసరావు కూడా ప్రధానమంత్రి సభలో నోరు విప్పకపోవడం అన్యాయమన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించడంతోపాటు ప్రభుత్వరంగంలోనే కొనసాగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు ఆర్‌కేఎస్‌వీ కుమార్, ఎ.లోకేష్, కె.సంతోషం, కామేశ్వరి, గొలగాని అప్పారావు, శ్రీదేవి, పి.లక్ష్మణస్వామి, రాజేంద్రప్రసాద్, కె.సుబ్బన్న, జె.శ్రీలక్ష్మి, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా కానిస్టేబుల్ పరీక్షలు


కైలాసగిరి పోలీస్ మైదానంలో అభ్యర్థులకు సూచనలిస్తున్న అనకాపల్లి ఎస్పీ తుహిన్ సిన్హా

ఆరిలోవ : కైలాసగిరి ఆర్మ్‌డ్ రిజర్వ్‌డ్ పోలీస్ మైదానంలో స్టేట్ లెవెల్ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు ఆధ్వర్యంలో ఉమ్మడి విశాఖ జిల్లాలో చేపడుతున్న కానిస్టేబుళ్ల నియామక పరీక్షలు కొనసాగుతున్నాయి. గురువారం ఎనిమిదో రోజు శరీర దారుఢ్య పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. ఈ పరీక్షలకు 600 మందికి 304 మంది అభ్యర్థులు హాజరయ్యారు. వారిలో 237 మంది తదుపరి పరీక్షలకు అర్హత సాధించినట్లు అనకాపల్లి ఎస్పీ తుహిన్ సిన్హా తెలిపారు. ఈ పరీక్షలను ఎస్పీతోపాటు అడిషనల్ ఎస్పీ ఎల్.మోహన్ రావు, అనకాపల్లి సబ్ డివిజినల్ డీఎస్పీ ఎం.శ్రావణి, ఏఆర్ డీఎస్పీ పి.నాగేశ్వరరావు, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ టి.లక్ష్మి, సైబర్ ఇన్‌స్పెక్టర్ టి.కళ్యాణి, ఆర్ఐ రామకృష్ణ, ఎస్ఐ సురేష్‌బాబు పర్యవేక్షించారు.